ప్రజాశక్తి

బుధవారం 27 ఆగస్టు 2025

5

విజయనగరం

ఫిజియో థెరపీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని 3 భవిత క్లస్టర్‌లలో హైర్ బేసిస్‌లో ఫిజియోథెరపిస్ట్ గా పని చేసేందుకు బాచిలర్ ఫిజియోథెరపీ /ఎంపిటి నుంచి ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు vizianagaram.nic.in వెబ్ సైట్ ద్వారా పొందువచ్చునని తెలిపారపు. నింపిన దరఖాస్తులను సమగ్ర శిక్ష, జిల్లా కార్యాలయం 30వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సమర్పించాలని కోరారు. ఒకో ఫిజియోథెరపిస్ట్ కు మూడు మండలాలు కేటాయిస్తారని, మండలానికి 4 క్యాంపుల చొప్పున మూడు మండలాలకు 12 క్యాంపులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

డెంకాడ మండలం సింగవరంలో వరి పంట మునిగిన వరినాట్లు

విస్తారంగా వర్షాలు

- అత్యధికంగా కొత్తవలసలో 65.4 మి.మీ. వర్షం
- డెంకాడలో 20 ఎకరాల్లో వరి నాట్లు మునక

ప్రజాశక్తి-విజయనగరంకోట/డెంకాడ

బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం జిల్లా మొత్తంగా సరాసరి 24.7మి.మీ. వర్షం కురిసింది. ఏకధాటి వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.డెంకాడ మండలంలో 20 ఎకరాలు వరి నాట్లు నీట మునిగాయి. మరోవైపు చెరువుల్లోను, పొలాల్లోను నీరు చేరి ఉబాలు ఊపందుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా కొత్తవలస మండలంలో 65.4మి.మీ, నెల్లిమర్లలో 61.2, జామిలో 55.8, విజయనగరంలో 50.8, పూసపాటిరేగలో 47.2, డెంకాడలో 45.6, భోగాపురం మండలంలో 48.8మి.మీ. వర్షం కురిసింది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశమున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

గజపతినగరంలో భారీ వర్షం

గజపతినగరం రూరల్ : గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. మంగళవారం తెల్లవారుజాము నుండి ఒక మోస్తరు వర్షం నిలకడగా కురుస్తుంది. వాగులు, వంకలు, చెరువు, కాలువలు పొంగు పొర్లుతున్నాయి. భారీ వర్షాలు కురవడంతో పలువురు అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింగవరంలో 20 ఎకరాల్లో వరి పంట మునక

డెంకాడ : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిన భారీ వర్షం వల్ల మండలంలోని సింగవరం గ్రామంలో 20ఎకరాల్లో వరి ఉబాలు మునిగిపోయాయి. ఇలా మరో రెండు రోజులు వర్షాలు పడితే వరి పంటలు పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు భారీ వర్షాలు పడితే వర్షపు నీటిని మళ్లించడానికి పొలాల్లో కాలువలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అసలే వర్షాలు లేటుగా పడటంతో వరి నాట్లు ఆలస్యంగా వేశారు. ఇప్పుడు అధిక వర్షంతో వరి మునిగిపోయి కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు

3600 క్యూ సెక్కుల నీరు విడుదల

వంగర : మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్టు రెండు ప్రధాన గేట్లు ఎత్తి మంగళవారం 3600 క్యూ సెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెట్టినట్లు ప్రాజెక్టు ఎఇ కె. నితిన్ కుమార్ తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో ఎగువున కురుస్తున్న వర్షాలు కారణంగా సువర్ణముఖి, వేగావతి నదుల నుండి 2068 క్యూ సెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి లెవెల్ నీటిమట్టం 65 మీటర్లు కాగా ప్రస్తుతం 64.49 లెవెల్ నీటిమట్టం ఉందని తెలిపారు. కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని ప్రస్తుతం నిలుపుదల చేశామన్నారు.

గేట్లు ఎత్తివేయడంతో దిగువకు పోతున్ననీరు



భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారీ వర్షాల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తమంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. బుధవారం కూడా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఒడిషా, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో, ముఖ్యంగా నాగావళి పరీవాహక మండలాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇరిగేషన్ ఇంజనీర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నదులు, రిజర్వాయర్లలో ప్రస్తుత నీటి ప్రవాహ పరిస్థితిని తెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారులంతా మండలాల్లోనే ఉంటూ నిత్యం పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. నదులు, చెరువులు, రిజర్వాయర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. నాగావళి నదీ పరీవాహక మండలాలు వంగర, రేగిడి ఆమదాల వలస, సంతకవిటి మండలాల్లో కాలువలు, చెరువుల గట్లును పరిశీలించి, బలహీనంగా ఉన్న చోట్ల యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలని, ఎంపిడిఒలు, వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు, ఇంజనీర్లు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డిపిఒ, పంచాయతీరాజ్ ఎస్ఇ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, డిఎంఅండ్‌హెచ్‌ఒలు బుధవారం తమ కార్యాలయాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు.

3వేల టన్నుల యూరియా సిద్ధం

జిల్లాలో ప్రస్తుత పంటలకు సరిపడా సుమారు 3వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాకు ఉందని కలెక్టర్ చెప్పారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందవద్దని సూచించారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లు, మార్క్‌ఫెడ్ కేంద్రాలు, ప్రయివేటు షాపుల్లోకూడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఒకవేళ ఎక్కడైనా స్టాకు అయిపోతే, సమీప ప్రాంతం నుంచి అప్పటికప్పుడు తెప్పించి సరఫరా చేయాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని సూచించారు. తాహసీల్దార్లు, ఎంపిడిఒలు మండలాల్లోని ఎరువుల షాపులు, పిఎసిఎస్ లతోపాటు రైతు సేవా కేంద్రాల్లో కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు.



విశాఖ జిల్లాలోకి

ఎస్.కోట నియోజకవర్గం

ప్రభుత్వానికి నివేదిక పంపిన కలెక్టర్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలోని ఎస్.కోట అసెంబ్లీ నియోకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలిపిపేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఈమేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మూడు రోజుల క్రితమే ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు తెలిసింది. జిల్లాల పునర్విభజన చేస్తామంటూ ఇటీవల ప్రభుత్వం ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లా భౌగోళిక పరిస్థితులు, జనాభా, దూరభారాలు, ప్రజల ఆకాంక్ష వంటి అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోందని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఇటు ప్రజాప్రతిధులు, అటు జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరపున కలెక్టర్‌ను ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం కోరింది. దీనిపై స్పందించిన కలెక్టర్ విశాఖ పార్లమెంట్ పరిధిలోవున్న ఎస్.కోట నియోజక వర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేయడం మేలంటూ నివేదిక పంపినట్లు తెలిసింది. పాలనా సౌలభ్యం, దూరభారాన్ని బట్టి ఈ రకమైన ఆలోచన చేసినట్టుగా అధికారుల వాదన వినిపిస్తోంది. జామి మండలంలోని 27 పంచాయతీలకుగాను 12 పంచాయతీలు గజపతినగరం నియోజకవర్గం లోనూ, 15 పంచాయతీలు ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోనూ ఉన్నాయి. కానీ, వీటన్నింటినీ విశాఖ జిల్లాలో విలీనానికి ప్రతిపాదనలు చేయడం గమనార్హం.

విజయనగరం జిల్లా కేంద్రానికి ఎస్.కోట నియోజకవర్గం 35కిలో మీటర్ల దూరంలో ఉంది. విశాఖపట్నం జిల్లా కేంద్రం 52 కిలోమీటర్లలో ఉంది. అదే నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస మండల కేంద్రం 27కిలోమీటర్లు, వేపాడ 52 కిలోమీటర్లు, జామి, 47, ఎల్.కోట 43కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. కానీ, రహదారి, రైల్వేమార్గం వంటి సదుపాయాల కారణంగా ఈ నియోజకవర్గంలోని మెజార్టీ ప్రజానీకం విశాఖ నుంచే ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ సంబంధాలు ఉండడం ఇందుకు కారణం. ఈనేపథ్యంలో తమను విశాఖలో చేర్చాలంటూ చాలా కాలంగా ఈ నియోజకవర్గంలోని మెజార్టీ ప్రజానీకం కోరుతున్నారు. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కూడా ఉంటుంది. ఈనేపథ్యంలో ఎస్.కోట నియోజకవర్గమే కాకుండా జామి మండలంలోని గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని పంచాయతీలు కూడా విశాఖలో విలీనం కావడం వల్ల విజయనగరం జిల్లా భౌగోళిక పరిధితోపాటు నియోజకవర్గాల సంఖ్య కూడా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎస్.కోట మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల పరిధిలోనూ నాలుగు మండలాల చొప్పున ఉన్నాయి. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గ పునర్విభజన జరిగితే నియోజకవర్గానికి మూడు మండలాలు చొప్పున ఉండవచ్చని, ఆ మేరకు జిల్లాలో నియోజకవర్గాల సంఖ్య పెరిగేందుకు అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్.కోట నియోజకవర్గంతోపాటు జామిలోని మిగిలిన పంచాయతీలను కూడా విశాఖలో కలపడం వల్ల దాదాపు రెండు అసెంబ్లీ నియోజక వర్గాలను విజయనగరం వదులుకున్నట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ప్రభావం ఏ రాజకీయ నాయకులపై ఏమేరకు పడే అవకాశం ఉంటుందో వేచి చూడాల్సిందే.

అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్తు భారాలపై 28న ప్రతిజ్ఞ

వామపక్ష నాయకుల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ పోరాట అమరవీరుల వీరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలు, అధిక ధరలు భారాలకు వ్యతిరేకంగా ఈనెల 28న వామపక్షాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయనున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్ది అప్పలరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్తు పోరాటంలో ఆగస్టు 28న రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి మృతి చెందారని, ఆ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ ఛార్జీల వ్యతిరేకంగా పోరాటం కోసం ప్రతిజ్ఞ చేయనున్నామని తెలిపారు. నాడు విద్యుత్ పోరాటం జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీలపై బాదుడే బాదుడు అని చెప్పి ప్రచారం చేసిన కూటమి నాయకులు ఎన్నికల్లో లబ్ధి పొందిన తర్వాత అవే విద్యుత్ భారాలు వేసి ప్రజలను మోసగించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై పెనుభారాలు వేస్తున్నారన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తున్నారన్నారు. నాటి విద్యుత్తు పోరాటం స్ఫూర్తితో నేడు భారాలపై మళ్లీ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వికలాంగుల పెన్షన్లు తొలగించడం, రేషన్ కార్డులు కుదింపు వంటి చర్యలు చేపడుతున్నారన్నారు. ట్రూఅప్ ఛార్జీలు పేరుతో 50 వేల కోట్లు భారం వేశారన్నారు. నిత్యావసరం వసువులు ధరలు పెరుగుతున్నా నియంత్రించే చర్యలు లేవన్నారు. ఈ భారాలకు, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా, ఉపాధి అవకాశాల కోసం ప్రతిజ్ఞ. చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

అంగన్వాడీలకు నాణ్యమైన సరుకులు పంపిణీ

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

అనుబంధ పోషకాహార పంపిణీ కార్యక్రమంలో నాణ్యమైన వస్తువులను సకాలంలో పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ మరియు అనుబంధ పోషకాహార కార్యక్రమ జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాల సంజీవిని పథకం, పౌష్టికాహార కిట్లు, బాలామృతం సరఫరాలపై సమీక్ష నిర్వహించారు. జెసి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న ఆహార పదార్థాలు, పోషకాహార కిట్లు నాణ్యత, కొలతలు నిర్దేశించిన ప్రమాణాలలో ఉండాలని తెలిపారు. ప్రాజెక్టు అధికారులు ప్రతినెలా వారి పరిధిలో 30 శాతం అంగన్వాడీ పాఠశాలలను వ్యక్తిగతంగా తనిఖీ చేయాలన్నారు. పోషకాహార కిట్లు నాణ్యత, కొలతలపై ప్రతి మండలం, ప్రాజెక్టు పరిధి నుండి కొంతమంది లబ్ధిదారులకు ఫోన్ చేసి అభిప్రాయాలు తెలుసుకొని వచ్చే సమావేశానికి నివేదిక అందజేయాలన్నారు. ఐసిడిఎస్ పీడీ టి.విమలా రాణి జిల్లాలో అమలు జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. జీవనరాణి, జిల్లా సప్లై అధికారి జి.మురళినాథ్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ బి శాంతి పాల్గొన్నారు.

30న సేనతో సేనాని : యశస్విని

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ఈనెల 28వ తేది నుండి 30వ తేది వరకు విశాఖపట్నంలో జరగనున్న సేనతో సేనాని కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్విని, ఎమ్మెల్యే లోకం మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కార్యకర్తలకు దశ దిశ నిర్దేశం చేసేందుకు ఈనెల 30వ తేదీన విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో సేనతో సేనాని కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు పడాల అరుణ, గురాన అయ్యలు, అవమాపు విక్రమ్, విజయనగరం ఎఎంసి వైస్ ఛైర్మన్ బొబ్బాది చంద్రి నాయుడు, వబిల్లి సత్తిబాబు, విజినిగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా సేవలు వెలకట్టలేనివి : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మదర్ థెరీసా అందించిన సేవలు వెలకట్టలేనివని ఎస్‌పి వకుల్ జిందల్ అన్నారు. నగరంలోని సిబి కాలనీలో గల థెరీసా క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరీసా 115వ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన థెరీసా క్లబ్ అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి, వ్యవస్థాపకులు కె.టి.కురియాకోస్, ఎస్‌పి థెరీసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం థెరీసా బుక్ సెంటర్, వంటశాల, వాటర్ ప్లాంట్ ను సందర్శించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ మదర్ థెరీసా చూపిన మానవతా మార్గంలో మనమంతా నడవాలని పిలుపునిచ్చారు. థెరీసా క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం, థెరీసా క్లబ్‌లో టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు ఎస్‌పి ప్రశంసా పత్రాలను అందజేశారు.

విజయనగరం టౌన్ : అయ్యన్న పేట జంక్షన్లో ఉన్న మదర్ థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆర్గనైజేషన్ 8వ వార్షికోత్సం, మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్, గౌరవ అధ్యక్షులు వేణుగోపాలం మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు శ్రావణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి గుర్తింపు

టిడిపి విస్తృత సమావేశంలో ఎంపి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. మంగళవారం క్షత్రియ కల్యాణ మండపంలో పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీ, సాధికార కమిటీల ప్రతిపాదనల స్వీకరణ నిమిత్తం ఏర్పాటు చేసిన విజయనగరం పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర కేంద్రం నుంచి వచ్చిన త్రిసభ్య కమిటీ సభ్యులు శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎమ్‌డి ఫరూక్, కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ కష్టపడి పని చేసిన వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుం దనడానికి తానే ఉదాహరణ అని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని సూచించారు. ఆశించిన పదవి రానంత మాత్రాన మనం అక్కడితో ఆగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కోసం పని చేయాలన్నారు. గత ఐదేళ్లలో పార్టీ అధికారంలో లేనప్పటికీ నిబద్ధతో కార్యకర్తలు కష్టపడి పనిచేసారని అలాంటి వాళ్ళకి పార్టీ తగిన గుర్తింపు ఇచ్చి అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, సుజయ్‌కృష్ణ రంగారావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే గనబాబు, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా పార్లమెంటు కమిటీ ఏర్పాటుపై చర్చ

విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ ఏర్పాటు విషయమై జిల్లాకు వచ్చిన త్రిసభ్య కమిటీ సభ్యులు ఎమ్‌డి ఫరూక్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే గణబాబుతో పాటు జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు మంగళవారం సాయంత్రం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో సమావేశమయ్యారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న పలువురు దరఖాస్తులు అందజేశారు. అయితే ప్రధానంగా అధ్యక్ష పదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్న వారిలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, కంది చంద్రశేఖర్, కెఎ నాయుడు, కోళ్ల అప్పలనాయుడు, కరణం శివరాం కృష్ణ ఉన్నారు. జిల్లాలో 17 విభాగాల్లో కమిటీ సభ్యుల పదవులుకు దరఖాస్తులు అందజేశారు. వీటిన్నింటిపైనా త్రిసభ్య కమిటీ సభ్యులు చర్చించారు. పోటీ తీవ్రంగా నెలకొనడంతో జాబితాను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం లేదా ప్రమాదవసాత్తు మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్‌పి వకుల్‌జిందల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయా కుటుంబాలతో సమావేశమయ్యారు. వారికి ప్రభుత్వం నుండి రావాల్సిన సర్వీసు బెనిఫిట్స్, వారి సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. మృతి చెందిన ఒక్కొక్క పోలీసు కుటుంబానికి పెండింగులో ఉన్న సర్వీసు బెనిఫిట్స్, ప్రస్తుతం వాటి స్థితి, ప్రగతి, కుటుంబంలో అర్హత కలిగిన వ్యక్తులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి కార్యాలయ అధికారులను ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు మినహా మిగిలిన వారికి అన్ని బెనిఫిట్స్ ను ఇప్పటికే అందజేశామని తెలిపారు. ఇంకా కొన్ని కుటుంబాలకు పెండింగులో ఉన్నాయని తెలిపారు. పెండింగులో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టేందుకు అర్హతలు కలిగిన వ్యక్తులు వెంటనే ధ్రువపత్రాలను జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేస్తే, నియామకాలకు చర్యలు చేపడతామన్నారు. ఏ సహాయం కావాలన్నా తనను నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసు స్టేషనులో విధులు నిర్వహిస్తూ పి.శ్రీనివాసరావు హోంగార్డు మరణించగా, వెల్ఫేర్ గ్రాంట్ గా మంజూరు చేసిన రూ.15 వేలు చెక్ ను ఆయన సతీమణి పి.లక్ష్మీ ప్రసన్నకు ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిపిఒ పరిపాలనాధికారి పి.శ్రీనివాసరావు, రిజర్వు ఇన్స్ పెక్టరు ఎన్.గోపాల నాయుడు, ఆఫీసు సూపరింటెండెంట్లు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి, ఆర్.ఎస్.ఐ. ప్రసాదరావు, పోలీసు అసోసియేషను అధ్యక్షులు కె.శ్రీనివాస రావు, జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగులు, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందల్

వర్షాలు నేపథ్యంలో ప్రత్యేక బృందాలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అల్పపీడనం వల్ల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగర ప్రజల అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేసామన్నారు. ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినట్లయితే 98499 06486 అనే నెంబర్ కు కాల్ చేయవచ్చునని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గాడిఖాన, బుచ్చెన్నకోనేరు, రాజీవ్ నగర్, తోటపాలెం అరకాల గెడ్డ వీధి, దాసన్నపేట, మంగళవీధి ప్రాంతీయులకు పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరంలో ఫ్లెక్సీలు, హోర్డింగులను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశించామన్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ కెఎల్‌పురంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

తపాలా బిళ్లలు సేకరించే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తపాలా బిళ్లల సేకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'దీన్ దయాళ్ స్పర్శ్ పథకం ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తుందని తపాలాశాఖ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. చదువుల్లో మంచి ప్రతిభ కనబరుస్తూ స్టాంపులు సేకరించే 6,7,8,9 తరగతుల విద్యార్థులకు ఏటా ఈ స్కాలర్ షిప్ అందజేస్తారని తెలిపారు. అభ్యర్థి కనీస అర్హత 60శాతం ఉతీర్ణత లేదా సమానమైన గ్రేడ్ పాయింట్లు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5శాతం సడలింపు ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6వేలు ఇస్తారని తెలిపారు. అప్లికేషన్ కోసం దగ్గరలోని తపాల కార్యాలయంలో సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తులను పోస్ట్ మాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్, విశాఖపట్నం-530017 వారికి స్పీడ్‌పోస్టు ద్వారా సెప్టెంబర్ 16లోగా పంపాలని తెలిపారు.

31లోగా పాఠశాలల్లో చేరాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు విద్యా హక్కు చట్టం కింద కేటాయించిన 25 శాతం సీట్లలో ఎంపికైన వారు ఈనెల 31లోగా పాఠశాలల్లో చేరాలని డిఇఒ మాణిక్యంనాయుడు, సర్వశిక్ష కోఆర్డినేటర్ ఎ.రామారావు కోరారు. ఈఏడాది కొన్ని మిగిలిపోయిన సీట్ల లాటరీ ఫలితాలు విడుదలయ్యాయని,జి ల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలో 676 సీట్లు కేటాయించారని, విద్యార్థులు వెంటనే పాఠశాలల్లో చేరాలని సూచించారు.

సీతంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎగిస్ డిజిటల్ వారిచే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. సివిల్, ఇఇఇ, మెకానికల్ విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి స్క్రీనింగ్ టెస్ట్, ఆటోకాడ్ డిజైన్‌లో ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి 20 మంది ని ఎంపిక చేసిన్నట్టు ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.విజయ్ కుమార్, డెలివరీ హెడ్ కె.విజయ్ ప్రసాద్ , మానవ వనరుల శాఖ మేనేజర్ బి.విజయగ్రేస్, జి.లోహిత తెలిపారు. వీరికి శిక్షణా సమయంలో 2.4లక్షల ప్యాకేజీతో అవకాశాలు అందజేశారు.

సోలార్ యూనిట్ల లక్ష్యాలను సాధించాలి

జిల్లా స్థాయి కమిటీలో జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సోలార్ యూనిట్ల స్థాపనలో విద్యుత్ అధికారులు వారి లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. గ్రామాల్లో అవగాహన పెంచడం ద్వారా యూనిట్ల స్థాపన వేగవంతం చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జేసీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మండల వారీగా లక్ష్యాలను, ప్రగతిని సమీక్షించారు. తక్కువగా సాధించిన వారిని కారణాలను అడిగారు. బ్యాంక్‌లు సుమారు 700 దరఖాస్తులను సిబిల్ స్కోర్ లేనందున తిరస్కరించాయని అధికారులు తెలిపారు. ఏయే బ్యాంక్ ల వద్ద దరఖాస్తులు పెండింగ్ ఉన్నదీ జాబితా తీసుకొని పరిష్కరించాలని ఎస్ఇకి సూచించారు. పి.ఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్ర స్థాయి లో జిల్లా 8 వ స్థానంలో ఉందని తెలిపారు. విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత/తక్కువ ధర విద్యుత్‌ను అందించడంలో ఈ పథకం సహాయ పడుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, బ్యాంకు అధికారులు, హౌసింగ్ పీడీ మురళి, సోలార్ విద్యుత్ వెండర్స్, ఎడిలు, ఎఇలు పాల్గొన్నారు.

రైతు డిపోలపై కొరడా

'ప్రజాశక్తి'కథనానికి స్పందన

గరివిడి: ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ మెట్ట, ఉణుకూరు గ్రామాల్లో ఉన్న రైతు డిపోలను రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఐ.కృష్ణలత, ఎఒ శ్రీనివాసరావు, సిఎస్‌డిటి రామారావులు ముందుగా రైతు డిపో స్టాక్ రిజిస్టర్లను, గోదాంలో ఉన్న స్టాకును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముందుగా శ్రీ వెంకటేశ్వర రైతు డిపోను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రాప్తికి అమ్మకాలు జరపాలన్నారు. ఉణుకూరు శ్రీలక్ష్మీ గణపతి ట్రేడర్స్ డిపోను తనిఖీ చేయగా తహశీల్దార్ కొన్ని సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కృత్రిమ కొరత చేపడితే 6ఎ కేసులు తప్పవని హెచ్చరించారు.

రేగిడి: ఎరువుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

వీరితోపాటు ఎస్ఐ లీలావతి, ఇంచార్జి ఆర్ఐ కిరణ్ కుమార్, ఎఇఒ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: ప్రతి రైతుకు ద్రవరూప ఎరువులపై అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర రావు సూచించారు. మండలంలోని మోపాడ సత్తిరాజు ఎంటర్ప్రైజెస్, డెంకాడ సాయికృష్ణ రైతు మిత్ర గ్రూప్ ఎరువులు దుకాణంలో డెంకాడ పిఎసిఎస్‌లో మంగళవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర రావు, తహశీల్దార్ రాజారావు, వ్యవసాయ అధికారి సంగీత ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. ఎరువుల నిలవలను స్టాక్ బోర్డులను రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రామకోటి, విఎఎ లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

15 రోజులు దుకాణం నిలిపివేత

గరివిడి: స్థానిక గర్భాం రోడ్డులో ఉన్న శ్రీ రాధాకృష్ణ ట్రేడర్సుపై వచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక అధికారి, పశుసంవర్ధక శాఖ జె.డి ఎన్. దామోదరరావు, తహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ లోకేశ్వరరావు, వ్యవసాయ అధికారి ప్రసాదరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియా అధిక ధరలు, ఉత్పత్తుల లింకేజ్ అమ్మకాలు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాధాకృష్ణ దుకాణంలో తేడాలు ఉన్నందున 15 రోజులు అమ్మకాన్ని నిలిపివేసామన్నారు. విచారణ చేపట్టి తగు జరిమానా విధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అచ్చుతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలో ఎరువులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అమరా శివ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. మండలంలో ఎరువుల కొరత నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా రెండు మూడు రోజుల్లో 280 టన్నుల యూరియా తెప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో ఈ ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని, ప్రస్తుతం యూరియా తప్ప డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకు 1350 హెక్టార్లలో వరినాట్లు పడ్డాయని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి నానో ఎరువులపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో కొండకెంగువ విహెచ్ఎ హైమావతి, ఆరికతోట విహెచ్ఎ రేవతి పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్, జెకె అగ్రి ఇండియా ట్రేడర్స్‌లో విజిలెన్స్ శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి బి ప్రసాద్, ఎడిఎ బి.భానులత, ఎఒ రవీంద్ర, విజిలెన్స్ సిఐ, బి. సింహాచలం, విజిలెన్స్ ఎజిఎం ఎం.సురేష్ కుమార్ మంగళవారం ఎరువులు నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఈఫోస్ మెషిన్‌లో డిబిటిలను తనిఖీ చేశారు. జెకె అగ్రి ఇండియా ట్రేడర్స్ ఎరువులు దుకాణంలో బిల్లులలో వ్యత్యాసం గమనించి 6ఎ కేసు నమోదు చేశారు. ఎరువులను ప్రభుత్వం నిర్ధారించిన ధర కంటే ఎక్కువ ధరకు అమ్మినా, ఎరువులు కుత్రిమ కొరత సృష్టించిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి - బొబ్బిలి

మాట్లాడుతున్న జడ్జి హేమ ప్రవంతి

మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి హేమ ప్రవంతి జానకి రామ్ ఎస్‌సి, ఎస్‌టి యాక్ట్ పై న్యాయ అవగాహన సదస్సును మంగళవారం బొబ్బిలి కోర్టు ఆవరణలో నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పౌర హక్కుల రక్షణ చట్టం 1955, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నివారణ చట్టం 1989 హక్కులను రక్షించడం, వారిపై దురాగతాలను నిరోధించడం కోసం ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షెడ్యూల్ కులాలు, తెగల అత్యాచారాల నివారణ చట్టం ప్రత్యేకంగా వారిపై జరిగే నేరాలను దౌర్జన్యాలను అరికడుతుందన్నారు. ఈ నేరాల విచారణ కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు, బాధితులకు ఉపశమనం, పునరావాసం కల్పించడం ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ఆనంద్ కుమార్, సీనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

31 మంది విద్యార్థులకు ఉచిత సీట్లు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విద్య హక్కు చట్టం (ఆర్‌టిఇ) కింద మూడవ విడతలో మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో 31 మంది పేద విద్యార్థులకు మొదటి తరగతిలో ఉచిత సీట్లు కేటాయించినట్లు మండల విద్యాశాఖ అధికారి బి. పాపినాయుడు మంగళవారం తెలిపారు. ఇప్పటికే రెండు విడతలలో నివాస గ్రామానికి 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలల్లో సీట్లు కేటాయించగా, మిగిలిన సీట్ల కోసం 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించామని ఆయన వివరించారు. లాటరీ ప్రక్రియ ద్వారా ఎంపిక జరగగా, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 31 మంది విద్యార్థులు ఉచిత సీట్లు పొందారని చెప్పారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు మొబైల్ ఫోన్ల ద్వారా సమాచారం అందుతుందని, ఆ ఆధారంగా ఈ నెల 31వ తేదీ లోపు ఆయా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద కూడా ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రదర్శించామని పాపినాయుడు తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

సిఎం సహాయ నిధి చెక్కులను కోటలో మంగళవారం ఎమ్మెల్యే బేబినాయన పంపిణీ చేశారు. పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి దోహదం చేస్తుందని చెప్పారు. రామభద్రపురం మండలం శిష్ఠు సీతారాంపురం గ్రామానికి చెందిన వై.గణపతికి రూ.25,260, పట్టణానికి చెందిన వి.అప్పారావుకు రూ.20వేలు, ఎ.వరలక్ష్మికు రూ.25వేలు, కె.ఇందిరకు రూ.40వేలు, జగన్నాథపురానికి చెందిన ఆర్.ఈశ్వరరావుకు రూ.73,428 చెక్కులను అందించారు.

డిజెలు పెడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి చేసుకోవాలని డిఎస్‌పి భవ్యరెడ్డి కోరారు. తన కార్యాలయంలో ఆమె మంగళవారం మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు అనుమతులు తీసుకుని ఎటువంటి గొడవలూ లేకుండా చేసుకోవాలన్నారు. డిజె సౌండ్ బాక్సులు పెట్టినా, రికార్డింగ్ డాన్సులు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉన్న స్థలాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. షెడ్యూల్ రూట్ ప్రకారం నిమజ్జనం చేయాలన్నారు.

ఒప్పందం ప్రకారం షేర్లు ఇప్పించండి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

భూమి విలువకు సరి సమానమైన షేర్లు ఇస్తామని, పది రూపాయలు విలువగల షేర్ ధర మూడేళ్లలో వంద రూపాయల పైన అవుతుందని నిర్వాసితులందరికీ కంపెనీలో వాటా ఉంటుందని నమ్మించి భూమి తీసుకున్న జిందాల్ పై జిల్లా కలెక్టర్ ఎందుకు చర్య తీసుకోలేరో చెప్పాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం బొడ్డవరలోని నిర్వాసితులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ప్రకారం నిర్వాసితులకు న్యాయం చేయని జిందాల్‌కే వత్తాసు పలుకుతూ కలెక్టర్ మాట్లాడడం అన్యాయం అన్నారు. జిందాల్ నిర్వాసితుల నుంచి భూమి తీసుకున్నప్పుడు భూమి విలువకు సరి సమానమైన షేర్లు ఇస్తామని రాత్వపూర్వకంగా చెప్పి ఇప్పుడు ఆ హామీని పట్టించుకోకుండా ఆ భూమిని ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ కోసం కోట్ల రూపాయలకు అమ్మేందుకు జందాల్ యాజమాన్యం సిద్ధపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిర్వాసితుల 66 రోజులుగా ఆందోళన చేస్తూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

పిహెచ్‌సికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక పిహెచ్‌సి అభివృద్ధి సలహా మండలి చైర్మన్, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో అభివృద్ధి సలహా మండలి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి కావలసిన నిధులు ప్రభుత్వం నుంచి వచ్చే విధంగా కృషి చేయాలని, మరింత మెరుగైన వైద్య సౌకర్యం అందించేందుకు ఏటా సుమారు రెండు లక్షల రూపాయలు అవసరం ఉంటుందని అన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతంలో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. పారిశుధ్యం, స్టేషనరీ, ఎలక్ట్రికల్ ప్లంబింగ్ మరమ్మత్తులు, జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రం నుంచి మందులు తీసుకురావడానికి ప్రయాణ ఖర్చులు, తదితర 11 అంశాలపై తీర్మానం చేసి సుమారు రూ.43వేలు ఖర్చుకు అభివృద్ధి కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎస్. అప్పారావు, వైద్యాధికారి బి.అనిల్ కుమార్, వి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి- బాడంగి

రక్తదానంపై ఉన్న అపోహలను వీడి, యువతీ యువకులు ముందుకు రావాలని అమ్మ సేవా సంస్థ అధ్యక్షులు సురేష్ కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో అమ్మ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 38 మంది నుంచి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రక్తదానం ఒక సామాజిక బాధ్యత అని అన్నారు. రక్తదానం చేస్తే ఏదో జరుగుతుందని అని అనుకోవడం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రవి బాబు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, జెడ్‌పిహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.సత్యనారాయణ, ముగడ కరుణాకర్, సూర్యనారాయణ, అమ్మ ఫౌండేషన్ కార్యదర్శి సాయి, సభ్యులు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న డిడిఒ కిరణ్‌కుమార్

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిషత్, సచివాలయ ఉద్యోగులు విధులు బాధ్యతగా నిర్వహించి ప్రభుత్వం ఆదేశించిన అన్ని సర్వేలు సకాలంలో పూర్తిచేయాలని డిడిఒ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం డిఎల్‌పిఒతో కలిసి దుప్పలపూడి, బూసాయ వలస, రామభద్రపురం సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయాల ద్వారా జరుగుతున్న సర్వేలు పి 4 నమోదులు, సిబ్బంది సమయ పాలనపై సమీక్ష చేశారు. స్వామిత్ర సర్వేలో ఇంటి యజమానులను గుర్తించి హక్కు పత్రాలు మంజూరు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పనులు చేపట్టాలని, తాగునీరు సక్రమంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ అన్నారు. కొత్తవలసలో మంగళవారం అంబేద్కర్ జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిందని ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వాహన మిత్ర రూ.25వేలు లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ అకౌంట్‌లో వేయ్యాలని డిమాండ్ చేశారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక మంది వ్యవసాయం లాభసాటి లేక యువత ప్రైవేట్ ఫైనాన్సర్ల వద్ద అప్పులు చేసి, బ్యాంకుల వద్ద లోను ద్వారా ఆటోలు కొనుగోలు చేసి ప్రతినెల ఫైనాన్స్ చెల్లిస్తూ పిల్లల్ని చదివించుకుంటూ కుటుంబం పోషించుకుంటూ రాష్ట్రంలో సుమారు పది లక్షల మంది ఆటో డ్రైవర్లు స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులకు బేరాలు తగ్గుతున్నాయన్నారు. 2019లో గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 21 వల్ల అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు, ఇన్సూరెన్స్ ప్రీమియం పెంచారని అన్నారు. దీని వల్ల ఆటో కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాహన ఫిట్నెస్ (ఎటిసి) ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్స్ ప్రైవేటు వారికి ఇవ్వడం రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో దశల వారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు, మండల ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎస్.అప్పలరాజు, పి.రామారావు, గణేష్, అప్పారావు, సాంబ, శంకర్రావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు, నాయకులు

తయారు చేసిన ప్రతిమలతో విద్యార్థులు

పిల్లలకు సృజనాత్మకత పోటీలు

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సృజనాత్మకత పోటీలు నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకొని పిల్లలచే మట్టివినాయకుని ప్రతిమలను తయారుచేయించడం ద్వారా విద్యార్థులో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడం ప్రధాన ఉద్దేశ్యం అని హెచ్ఎం సుసర్ల కామేశ్వరి తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య ఆర్థిక సహకారం అందించి తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు అందించారు.

వర్షాకాలంలో పశువులతో జాగ్రత్త

ప్రజాశక్తి - వేపాడ

వర్షాకాలంలో పశువులపట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు, పశుపోషకులు, మేకలు, గొర్రెల కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల కోసం ఎత్తైన ప్రదేశాలలో సురక్షితమైన షెల్టర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశువులకు శుభ్రమైన మేత, శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరదలు వచ్చినప్పుడు, పశువులను వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మేత కోసం మేకలు, గొర్రెలను వరద ప్రభావిత ప్రాంతాలైన వాగులు, నదీ తీరప్రాంతాలకు తీసుకుని వెళ్లకూడదన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చేటప్పుడు పశువులను చెట్ల కింద కాకుండా సురక్షితమైన షెడ్లలో ఉంచాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

రానున్న పంచాయతీ ఎన్నికలకు బహుజన సమాజ్‌వాద్ పార్టీ పోటీ చేయడానికి సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ అన్నారు. మంగళవారం ఎస్‌కోట బిఎస్‌పి అధ్యక్షులు ధోని అప్పారావు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని కృష్ణ మాట్లాడారు. తమ పార్టీ చిత్తశుద్ధితో ప్రజలకు మెరుగైన పాలనను అందించడానికి సిద్ధంగా ఉందని రాబోయే ఎన్నికలలో బహుజనులు తమ ఓటు బహుజన సమాజ పార్టీకి వేసి భవిష్యత్తు కాలంలో మెరుగైన పాలనను పొందడానికి అవకాశం కల్పించాలని కోరారు. నియోజకవర్గ కార్యదర్శిగా ఉన్న ఎల్లపు నగేష్ క్రమశిక్షణ ఉల్లంఘించడం వల్ల పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తొలగించి ఆస్థానంలో కెరు దేముడును నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమించామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి విశాఖపట్నం జిల్లా జోనల్ ఇంఛార్జి పి.శివప్రసాద్, విశాఖ అధ్యక్షులు బి.విశ్వనాథం, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి బోని అచ్చుత రమణ, లక్కవరపుకోట మండల వైస్ ప్రెసిడెంట్ చలికాని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

ప్రధానోపాధ్యాయులు కర్రి సూర్యనారాయణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తనకు 40 ఏళ్ల ఉద్యోగ జీవితం ఎంతో సంతృప్తినిచ్చిందని, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేశానని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్రి సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 31న ఆయన ఉద్యోగ విరమణ నేపథ్యంలో ప్రజాశక్తితో మాట్లాడారు. తన ఉద్యోగ జీవితంలో 34 ఏళ్లు విద్యాబుద్ధులు నేర్పిన ఆయన ఆరేళ్లు వైద్య సేవలు కూడా అందించి ఔరా అనిపించారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే...

మాది గజపతినగరం మండలంలోని రంగుపురం. మా నాన్న కర్రి లచ్చుంనాయుడు, అమ్మ నారాయణమ్మ. వీరిద్దరికి మేము ముగ్గురు సంతానం. నేను, నాకు ఇద్దరు చెల్లెళు ఉన్నారు. నా తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుని నన్ను చదివించారు. కష్టపడి పైకి వచ్చిన వాళ్లల్లో నేను ఒకడినని చెప్పుకోవడానికి గర్వంగా ఉంటుంది. ఎటువంటి సౌకర్యాలు లేని సమయంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఈ స్థాయికి వచ్చాను. నేను అరుణను పెళ్లి చేసుకున్నాను. మాకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నాడు. నా పెద్ద కూతురు శైలజ డాక్టర్, పెద్ద అల్లుడు సుబ్బారావు కూడా డాక్టర్ వృత్తిలోనే ఉన్నారు. నా రెండో కూతురు స్వాతీ, అల్లుడు సాయిశేఖర్, నా కుమారుడు ఆదిత్య, కోడలు భవ్య కూడా సాఫ్ట్‌వేర్‌లో స్థిరపడ్డారు.

సూర్యనారాయణను సత్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

విద్యాభ్యాసం

నేను ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకూ గజపతినగరం మండలంలోని రంగుపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివాను. 6 నుంచి 7 వరకూ లోగిశ యుపి పాఠశాలలో, 8 నుంచి 10వ తరగతి వరకూ తోండ్రంగి పాఠశాలలో చదివాను. ఇంటర్ గరివిడి ఎస్ఆర్‌జె కళాశాలలో చదివాను. డిగ్రీ, పీజీ, ఎంఎ బిఇడి మొత్తం విశాఖపట్నంలోని ఆంధ్రయూని వర్శిటీలో పూర్తి చేశాను.

ఉద్యోగ జీవితం

నాకు ఉద్యోగం వచ్చినప్పటి నుంచి నా జీవితమంతా గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోనే సేవలందించాను. 1986 జూలై 2 గిరిజన సంక్షేమ శాఖలో ఎస్‌జిటిగా వేపాడ మండలం కొండగంగుపూడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చేరాను. అక్కడ నుంచి మెంటాడ మండలంలోని ఆండ్ర, బొబ్బిలి మండలంలోని నిమ్మలపాడు, సాలూరు మండలం తోనాం, కొత్తవలస, నెల్లిమర్ల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పనిచేశాను. సాలూరు మండలంలోని తోనాం పాఠశాలలో పనిచేసినపుడు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. నెల్లిమర్ల పాఠశాలలో పనిచేస్తుండగా మరోసారి హెచ్ఎంగా ప్రమోషన్ వచ్చింది. ఎక్కడైతే హెచ్ఎంగా ప్రమోషన్ వచ్చిందో అక్కడే పదవీ విరమణ పొందుతున్నందుకు ఆనందంగా ఉంది.

పలు అవార్డులు

నేను ఉత్తమ గణిత ఉపాధ్యాయులుగా పలు అవార్డులను పొందాను. ఏటా పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రధానోపా ధ్యాయునిగా నిరంతరం సేవలందించాను. జిల్లా, రాష్ట్ర స్థాయి గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యా యులుగా, ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ల చేతులు మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా, నిరంతర శ్రమజీవిగా, పరిపాలనదక్షులుగా అవార్డులు అందుకున్నాను. గిరిజన విద్యాభివృద్ధితో బాటు గిరిజన ఆరోగ్య ప్రధాతగా విశాఖ కెజిహెచ్‌లో 3 జిల్లాల తరపున మాస్టర్ ఐటిడిఎ లైజన్ అధికారిగా 6 సంవత్సరా లపాటు గిరిజనులకు వైద్య సహాయ సేవలు అందిం చాను. మొత్తం నా 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో నా తోటి ఉద్యోగులు, అధికారులు, కుటుంబ సభ్యుల సహకారంతో సంతృప్తిగా పనిచేశాను. ఉద్యోగ విరమణ అనంతరం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాని ప్రధానోపాధ్యాయులు కర్రి సూర్యనారాయణ మాస్టారు చెప్పారు.

వివక్ష పాటించడం చట్టరీత్యా నేరమే

- అంటరానితనం నిర్మూలన సామాజిక బాధ్యత
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్
- ఘనంగా డిబిఎస్‌యు మహాసభ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వివక్ష పాటించడం చట్టరీత్యా నేరమని, అంటరాని తనం నిర్మూలన సామాజిక బాధ్యత అని సీనియర్ సివిల్‌జడ్జి, జిల్లా న్యాయ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా మహాసభ మంగళవారం యూత్ హాస్టల్‌లో జరిగింది. ఈ సందర్భంగా డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు అధ్యక్షతన దళిత ఆదివాసీల హక్కులపై జరిగిన సదస్సులో కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం, పౌర హక్కుల పరిరక్షణ చట్టం ద్వారా అనేక రకాల వివక్షతలను నిర్మూలిస్తుందని, అందుకోసం పటిష్టమైన యంత్రాంగ రాష్ట్ర జిల్లా స్థాయిల్లో పనిచేస్తుందని తెలిపారు. బాధితులకు సాక్షులకు ఈ చట్టం ద్వారా హక్కు ఉన్నాయని, బాధితులు ప్రైవేట్ గా న్యాయవాదిని పెట్టుకొనే హక్కు, బెయిల్ విచారణలో బాధితులు అభిప్రాయాన్ని వినే హక్కు ఉందని తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అట్రాసిటీ బాధితులకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా సహాయం లభిస్తుందని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో వసతి, ఫీజు రియంబర్స్మెంట్, ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ వంటి సబ్ ప్లాన్ చట్టం ద్వారా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రతి అక్షరం నిలబడాల్సిన సమయం వచ్చిందని, ప్రజా సంఘాలు పత్రికా ప్రతినిధులు కలిసి ప్రజా సమస్యలపై పనిచేయాలని అన్నారు. అనంతరం డిబిఎస్‌యు ఆశయాల బ్రోచర్‌ను అతిథులంతా ఆవిష్కరించారు.కార్యక్రమంలో డిబిఎస్‌యు వ్యవస్థాపకులు జాతీయ నాయకులు థామస్ పల్లి దానం, ప్రొఫెసర్ వరహాల ద్వారా 'విదసం' కన్వీనర్ బూస వెంకటరావు, బుంగ భానుమూర్తి, పాండ్రంకి రమణ, జిల్లా హ్యూమన్ రైట్స్ అసోసియేట్ అధ్యక్షులు భవిరెడ్డి శంకరరావు, ఎఐసియు నాయకులు జి స్వామినాదం తదితరులు పాల్గొన్నారు.

జయప్రదంగా డిబిఎస్‌యు మహాసభ

డిబిఎస్‌యు జిల్లా మహాసభ ఘనంగా జరిగింది. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, అంటరానిత నిర్మూలనకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యాచార బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, బాధితుల సాక్షుల హక్కులను అమలు చేస్తూ మండల విజిలెన్స్ అండ్ మోనిటర్ కమిటీలను ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేశారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్ పార్వతి (విజయనగరం), ప్రధాన కార్యదర్శిగా ఎంపీ రాజు (గరివిడి), ఉపాధ్యక్షులుగా కాగాన సంజీవి (బొబ్బిలి) జాయింట్ సెక్రటరీగా ఎన్ కళావతి, ట్రెజరర్‌గా జి.రామలక్ష్మితో పాటు పలువురు జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సభలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

వసతి గృహం సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీపూడి సచివాలయం పరిధిలో గల గిరిజన బాలికల ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని జడ్జి డాక్టర్ ఎస్ విజయ చందర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో 'అసౌకర్యాలకు నిలయంగా గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహం' అనే కథనం వెలువడింది. దీనికి స్పందించి హైకోర్టు ఆదేశాల మేరకు కొత్తవలస జడ్జి విజయచందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.దేవి, సెక్రటరీ జెవి నాయుడు, సీనియర్ అడ్వకేట్లు టి.శివాజీ, జివి. రమణ, సిహెచ్. ప్రసాద్, జి. మహేశ్వర రావు, ఎన్. శ్రీరామ్మూర్తి, ఎంవిఎస్ గిరిబాబు, డి.శివప్రసాద్, కె. అచ్చిబాబు, వల్లం పూడి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని అంబాడ వెంకటాపురం గ్రామంలో బిసి బాలుర వసతి గృహాన్ని మంగళవారం తహశీల్దార్ ఐ.కృష్ణలత పరిశీలించారు. విద్యార్థుల మెనూ పట్టిక ప్రకారం వంటలపై ఆరా తీశారు. నివాస గదులు, ట్రంక్ పెట్లు, దోవతీలు వంటివి ఇచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మౌలిక సౌకర్యాలు, మెరుగైన విద్య అందించాలని సూచించారు. విద్యార్థులకు ఉదయం, రాత్రి సంపూర్ణ ఆహారం అందించాలన్నారు. వేడి నీరుతో పాటు వేడి ఆహారం అందించాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సిఎస్‌డిటి ఎం.రామారావు, ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

4.8 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- సంతకవిటి

స్థానిక జిఎంఆర్ కళాశాల ఎదురుగా ఉన్న మామిడి తోటలో మంగళవారం నలుగురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. వారి వద్ద నుండి 4.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పాలకొండకు చెందిన యువకులు దుర్గా ప్రసాద్, రఫీ, ఉదయ్ కుమార్, చంద్రశేఖర్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి మత్తుకు యువత దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గంజాయికి బానిసైతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే గంజాయి క్రియ, విక్రయాలపై మండలంలోని గట్టి నిఘా ఉంచామన్నారు.

గుర్తుతెలియని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని కొత్త సుంకరపాలెం మెయిన్ రోడ్ పక్కన గల బంద (చెరువు)లో సుమారు 40 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల పురుషుడు మృత దేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
EP No. 41/23 OS No.74/22

Between :
శీరంరెడ్డి వెంకటరావు .....D.Hr
And :
గనెడ అప్పారావు ....J.Dr

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తము J.Dr యొక్క ఈ క్రింది వివరించిన ఎసెస్‌మెంటు నెంబరులో గల ఆస్థి కోర్టులో తే 25-9-2025దీన ఉదయం గం॥ 10-30 నుండి సాయంత్రం 5గం॥ వరకు వేలం వేయబడును. వేలాంలో పాల్గొనదలచినవారు సదరు దినం హాజరై వేలం పాడుకోవలసినదిగా యీ ప్రకటన మూలంగా తెలియపర్చడమైనది.

షెడ్యూలు వివరములు

విజయనగరం జిల్లా, మెంటాడ మండలం, కుంటినవలస గ్రామ పంచాయతీ పరిధిలో J.Dr కు గల స్లేబు ఇల్లు యొక్క వివరములు :
ఇంటి నెం-3-122, ఎసెస్‌మెంటు నెం-522, హద్దులు :- తూ :- పెదిరెడ్ల వెంకినాయుడు ఇల్లు, ద :- కాలువ, ప:- మామిడి బలరాము ఇల్లు, ఉ:-మాదిరెడ్డి సోములు స్లేబు ఇల్లు.
D.Hr విలువ : రూ.3,00,000/-
అమీను విలువ : రూ.6,00,000/-

రంభ శివహరినాథరావు
న్యాయవాది, గజపతినగరం